క్లుప్తంగా

అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం



విశేష అలంకరణలో రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి వారు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయ పండితులు స్వామివారికి సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు మండల సమావేశం

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవి కుమార్ సోమవారం ఓ ప్రకటనలో ఎంపీపీ అధ్యక్షతన ఉదయం పది గంటలకు జరిగే సమావేశంలో గడిచిన మూడు నెలల్లో జరిగిన ప్రగతి, అభివృద్ధిపై శాఖల వారీగా చర్చిస్తారన్నారు. ఈ మేరకు గౌరవ సభ్యులు, మండల స్థాయి అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

ఘనంగా గీతాపారాయణ



గీతామందిరంలో భగవద్గీత పారాయణ చేస్తున్న భక్తులు

గోకవరం: స్థానిక వెలమపేటలోని గీతా మందిరంలో సోమవారం భగవద్గీత పారాయణ నిర్వహించారు. సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు ఆధ్వర్యంలో పలువురు మహిళా భక్తులు భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణ చేశారు. కార్యక్రమంలో గాజింగం చంద్రాయమ్మ, గండి వాణి, గంటా రాఘుపతి, గండి వేణమ్మ, గొల్లపల్లి పోసీరత్నం, ఎలుగుబంటి నాగమణి, తోట పోశికుమారి, గెద్దం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హైవేపై లారీ బోల్తా



జాతీయ రహదారిపై బెండపూడి వద్ద బోల్తా పడిన లారీ

తొండంగి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట ఆదివారం అర్ధరాత్రి లారీ బోల్తా పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం నుంచి ఐరన్ బ్యారల్స్ లోడుతో బెంగళూరు వెళ్తున్న లారీ తమ్మయ్యపేట వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి రహదారికి అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను అదుపు చేసి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. క్రేన్ సాయంతో లారీలో ఐరన్ బ్యారల్స్‌ను మరో లారీకి ఎక్కించి బోల్తా పడిన లారీని అక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

తాళ్లూరు లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించాలని వినతి



సీఎం చంద్రబాబుకు తాళ్లూరు లిఫ్ట్ సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలోని రైతులకు ఆయువుపట్టుగా మారిన తాళ్లూరు లిఫ్ట్‌కు మరమత్తులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ మేరకు సోమవారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేశారు. తాళ్లూరు లిఫ్ట్‌కు ప్రస్తుతం ఉన్న పీఎస్‌సీ పైపులైన్ల దెబ్బతినడంతో రైతుల పొలాలకు నీరు అందడం లేదన్నారు. దీంతో రైతులు పంటలు నష్టపోతున్నారన్నారు. తాళ్లూరు లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు. పత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, తదితరులు ఉన్నారు.

వ్యర్థం.. అనర్థం

- వెంటాడుతున్న డంపింగ్ యార్డు సమస్య
- రోడ్లపైనే వ్యర్థాల డంపింగ్
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు

తుని: పట్టణాన్ని సుందరంగా తీర్చదిద్దేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రధాన రోడ్లు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో పచ్చదనం ఉట్టిపడుతోంది. చెత్త సేకరణకు స్వచ్ఛభారత్ కార్పొరేషన్‌తో పాటు పలు సంస్థలు ఇతోధికంగా సహకరిస్తున్నాయి. ఇంత వరకూ బాగానే ఉన్నా తుని పట్టణానికి డంపింగ్ యార్డు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. రోజువారీ ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సమస్యను ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధుల దష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాల బారిన ప్రజలు పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రోడ్డు పక్కన వ్యర్థాలు వేయడంతో పందులు అందులో తిష్ట వేస్తున్నాయి. ప్రజలు ఇంకా ఏన్నాళ్లు మాకు చెత్త కష్టాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

తుని పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. 14 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రోజూ 15 వేల మంది వివిధ పనుల నిమిత్తం తుని పట్టణానికి వస్తారు. ఇళ్లు, హోటల్స్, కూరగాయలు, కిరాణా, పండ్లు, తినుబండారాలు తదితర కేటగిరిలో 39 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి సేకరించి 40 శాతం తడి, పొడి చెత్తగా విభజించి కంపోస్టు యార్డులు (సంపద తయారీ కేంద్రాలు)కు తరలిస్తున్నారు. ప్రధాన మార్కెట్‌లో వచ్చే బల్క్ వ్యర్థాలను పట్టణ శివారు ఇసుకలపేట శ్మశాన వాటిక సమీపంలోకి తరలిస్తున్నారు. వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు పందులు విచ్చల విడిగా స్వైర విహారం చేస్తున్నాయి. ఇలాగే పరిస్థితి కొనసాగితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



తుని ఉప్పరగూడెంలో రోడ్డుపై డంపింగ్ చేసిన వ్యర్థాలు

కొలిక్కిరాని డంపింగ్ యార్డు సమస్య

తుని పురపాలక సంఘం ఏర్పడి ఐదు దశాబ్దాలు గడుస్తున్నా డంపింగ్ యార్డుకు స్థలసేకరణ అందని ద్రాక్షగా మిగిలింది. పట్టణానికి సమీపంలో స్థలసేకరణ చేయాలంటే కోట్లు వెచ్చించాల్సి రావడంతో కార్యరూపం దాల్చలేదు. గతంలో తుని మండలం రేఖవానిపాలెం, ఎస్.చామవరం ప్రాంతాల్లో స్థలసేకరణ కోసం ప్రయత్నించినా అక్కడ ప్రజలు వ్యతిరేకించారు. ప్రస్తుతం డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలంటే 3 ఎకరాల స్థలం అవసరం. ఇంత పెద్దమొత్తంలో సొమ్ము వెచ్చించే అవకాశం లేక పోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లుపై అధికారులు దృష్టి సారించారు.

> **సమస్యకు త్వరలో పరిష్కారం**
>
> పట్టణంలో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు డంపింగ్ చేయవద్దని అధికారులకు సూచనలు ఇచ్చాం. ఆర్థిక సంఘం నిధులతో తడి, పొడి చెత్తలను వేరు చేసేందుకు రెండు చోట్ల షెడ్లను నిర్మిస్తున్నాం. ఇవి అందుబాటులోకి వస్తే చెత్తకు పరిష్కారం లభిస్తుంది. స్థలసేకరణకు సంబంధించి తుని మండలం హంసవరం సమీపంలో డి పట్టా భూమిని తీసుకునేందుకు ప్రతిపాదనలు పంపాం. –వెంకట్రావు, కమిషనర్, తుని

సీలింగ్ భూములు పేదలకు పంచాలి

జగ్గంపేట: మండలంలోని గుర్రప్పాలెంలో సీలింగ్ భూములను నిరుపేదలకు పంచాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు కూలీ సంఘ నేతలు, పేదలు గుర్రప్పాలెంలో సోమవారం నిరసన తెలిపారు. సీలింగ్ భూములను గత 20 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న నిరుపేదలకు తక్షణమే పట్టాలు మంజూరు చేయాలన్నారు. దీనిపై గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. సీలింగ్ భూములను సాగు చేసుకుంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతు కూలీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లిలోని మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని లివింగ్ గాడ్ చర్చ్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ డాక్టర్లు కంటి పరీక్షలు చేస్తారన్నారు. గెద్దనాపల్లి, పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెంకన్న ఆలయానికి వెండి కిరీటాల వితరణ



వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలు అందజేస్తున్న దాతలు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు భక్తులు నాలుగు వెండి కిరీటాలను వితరణ చేశారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండకు చెందిన శ్రీ షిర్డీ సాయి విద్యాసంస్థ, శీలది గ్లోబల్ స్కూల్ యాజమాన్యం సభ్యులు ఈ వెండి కిరీటాలను సోమవారం ఆలయానికి అందజేశారు. అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలను అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పులగం కృష్ణప్రసాద్, పులగం నరసింహారావు, దాతలు శీలది గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ జి.లక్ష్మీపద్మావతి, శ్రీషిర్డీ సాయి స్కూల్ కరస్పాండెంట్ శ్యామల, శ్రీదేవి, ఫణి, లక్ష్మి, చంటి, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- కన్నులపండువగా సత్యనారాయణస్వామి కల్యాణం
- వేలాదిగా తిలకించిన భక్తులు



ఏలేశ్వరంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పండితులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు నది ఒడ్డున వేంచేసిన అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామివారి వార్షిక కల్యాణం సోమవారం కన్నులపండువగా జరిగింది. అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామ్‌చంద్రమోహన్, చైర్మన్ ఐవీ రోహిత్ నేతృత్వంలో పండితుడు పెద్దింటి గోపాలకృష్ణాచార్యులు, పొన్నూరు సత్యనారాయణచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పట్టణం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వేద పండితులు వేదుల సూర్యనారాయణ శర్మ, అమరేశ్వర అవధాని, అర్చకులు కంచిబోట్ల రామ్‌కుమార్, ఇంద్రగంటి పవన్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి దంపతులు, ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు, ఒబిణ్ణి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భగభగమండే..



ఎండకు నిర్మానుష్యంగా మారిన ప్రత్తిపాడు మెయిన్ రోడ్డు

- మండిపోతున్న ఎండలు
- అల్లాడుతున్న ప్రజలు

ప్రత్తిపాడు: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నారు. ఉష్ణతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రత్తిపాడులో సోమవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే వేడిగాలులు ప్రారంభమయ్యాయి. రాత్రి సమయంలో కూడా 32 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పది గంటలు దాటితే చాలు రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. 11 గంటలకు వ్యాపారాలు షాపులు మూసివేస్తున్నారు. ఉదయం 9 గంటలు దాటితే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. చీకటి పడినా వడగాలులు తగ్గకపోవడంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో నాలుగు రోజుల పాటు ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉంటే భరించడం కష్టమని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

పలకరించని తొలకరి

జూన్ నెలలో 15 రోజులు గడిచినా ఇంకా తొలకరి పలకరించలేదు. ఎండలు మండిపోవడంతో రైతులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లే ప్రయాణికులు ముఖానికి ముసుగు, తలకు టోపి పెట్టుకుని వెళుతున్నారు. ఎండతాపం నుంచి రక్షించుకునేందుకు ప్రజలు శీతల పానియాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో జ్యూస్‌లు, కూల్‌డ్రింక్‌లు, కొబ్బరి బొండాల దుకాణాలు కళకళలాడుతున్నాయి. వర్షాలు పడితే ఖరీఫ్ సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

తాటాకిల్లు దగ్ధం

గొల్లప్రోలు: మండలంలోని కొడవలిలో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలి తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... గ్రామంలోని పోలవరపు చంద్రరావు తాటాకింట్లో ఉదయం 8.30 గంటలకు గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఏడు కాసుల బంగారం, రూ.లక్ష నగదుతో పాటు వంట సామగ్రి, దుస్తులు, ఇతర సామగ్రి కాలి బూడిదైనట్టు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగింది. ప్రమాద సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. దీనిపై బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

జగ్గంపేట: స్థానిక కాకినాడ రోడ్‌లో అన్న క్యాంటీన్‌ను సోమవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ క్యాంటీన్‌ను ప్రారంభించారు. పలువురికి అన్నం వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రోగులకు పరామర్శ



కొమ్మనాపల్లిలో డయేరియా బాధితులను పరామర్శించిన డీఎంఅండ్‌హెచ్ఓ నరసింహనాయక్

తొండంగి: మండలంలోని కొమ్మనాపల్లిలో డయేరియా రోగులను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి నరసింహనాయక్ సోమవారం పరామర్శించారు. కొద్ది రోజులుగా గ్రామంలో పలువురు వాంతులు విరోచనాలతో డయేరియా బారినపడి పలు ఆస్పత్రుల్లో చేరి వైద్యం పొందుతున్నారు. వీరిలో ఓ వివాహిత మృతి చెందిన సంగతి విదితమే. కాగా సోమవారం కూడా 10 కేసులు నమోదయ్యాయని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకూ 100 మంది డయేరియా బాధితులను గుర్తించారు. వీరంతా పిఠాపురం, కాకినాడ జీజీహెచ్, కత్తిపూడి, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నారు. డయేరియా ప్రబలిన నేపథ్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ నరసింహనాయక్ వైద్యశిబిరంలో రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి డయేరియా నివారణపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సరిత, వైద్యులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాలు ఆపాలంటూ నిరసన



యర్రవరం వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించిన టీడీపీ నేతలు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో దుకాణాల నిర్మాణాలు ఆపాలంటూ సోమవారం టీడీపీ నేతలు రహదారిపై బైఠాయించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో యర్రవరం వెళ్లే ప్రధాన రహదారిపై సుమారు గంటపాటు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 500 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్ల కింద అక్రమంగా దుకాణాల నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కారణంగా రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి సంఘటన స్థలానికి చేరుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో నిరసనకారులు ఆందోళన విరమించారు. దీనిపై సంబంధిత పంచాయతీ కార్యదర్శి మోహన్‌కుమార్‌ను వివరణ కోరగా దుకాణాదారుల యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా నిర్మాణాలకు కొడా అనుమతులు ఇచ్చిందని తెలిపారు. అధికార పార్టీ నేతలే రహదారిపై బైఠాయించి ఆందోళన చేయడంపై ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, పర్వత సురేష్, గొంతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



తుని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రత్తిపాడులో పేద ముస్లింలకు బియ్యం, పండ్లు పంపిణీ చేస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీను

తుని: ముస్లింలు త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక మసీదులో ముస్లింలు బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ అన్ని గుణాల కన్నా దాన గుణమే గొప్పదన్నారు. హజ్రత్ హిబ్రహీం త్యాగనిరతిని వివరించారు. ముస్లింలందరూ ఉత్తమమైన మార్గంలో నడవాలని సూచించారు.

ఏలేశ్వరం: పట్టణంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మార్కెట్ వీధిలోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంతటి ప్రాముఖ్యం ఉన్న ఈదుల్ జహాన్‌ను బక్రీద్‌గా భావిస్తామన్నారు. బక్రీద్‌ను త్యాగాల పండుగ అని పిలుస్తారన్నారు. మహమ్మద్ రసూల్ ముత్తాత మహ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం ఖలీలుల్లా అల్లాహ్ సందేశం మేరకు చేసిన త్యాగానికి ప్రతీకగా బక్రీద్‌ను నిర్వహిస్తారని వివరించారు. పలువురు పట్టణ ప్రముఖులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు చేయూత

ప్రత్తిపాడు: బక్రీద్ పండగను పురస్కరించుకుని గ్రామంలోని నిరుపేద ముస్లింలకు సోమవారం పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను చేయూతనందించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పేద ముస్లింలకు బియ్యం, పండ్లు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతి వెంకటేశ్వరరావు, కందిమళ్ల సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నాగులపల్లి పీహెచ్‌సీలో రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సౌజన్య

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య సూచించారు. మండలంలోని నాగులపల్లి పీహెచ్‌సీలో సోమవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఏడిస్ దోమ వల్ల డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతున్నారు. ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ సోకితే ఒళ్లనొప్పులు, కళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సీజన్‌లో దోమల నియంత్రణకు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్ వినియోగించాలని సూచించారు.

రామకృష్ణుని బోధనలు అనుసరణీయం

సామర్లకోట: రామకృష్ణుని బోధనలు సదా అనుసరణీయమని కడప రామకృష్ణ మిషన్ స్వామి అనుపమానంద మహరాజ్, రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ స్వామి సేవ్యానంద మహరాజ్ అన్నారు. పీబీ దేవం గ్రామంలో శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా రామకృష్ణుని ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రజల మనస్సులను సుసంపన్నం చేశాయన్నారు. స్వామి వివేకానందుడిని అందించి, యావత్ భారత్ జాతినే కాకుండా చికాగో విశ్వవేదికపై నుంచి యావత్ ప్రపంచం మనవైపు చూసేలా చేశారని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి గౌరవాధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, కార్యదర్శి విశ్వనాథ్, సభ్యులు తెలుగుంట్ల నరసింహరావు, నువ్వుల వెంకట్రాజు, సూర్యచంద్రరావు, బాబ్జీ, తోటకూర సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.